
# వ్యక్తి లేబొమ్మా?



—సోమయాజుల 'సురావ్'

శశిరేఖమ్మకు, పంతులుగారికి గల సంబంధం గురించి ఎవరికి తెలియదు. అయితే పంతులుగారి భార్య కామేశ్వరి తనకు సవతిగా శశిరేఖను ప్రస్తావించేది. ఆయనలో అంతటి విశేషం ఉందా అని అందరికి ఆశ్చర్యంగా ఉండేది. ఏమంటే —జంతువుగా ప్రసిద్ధిచెందారు ఆయన. జంతువుగా ఆయనను పేర్కొంటే జంతువులన్నీ కలిసి జంతు గౌరవ రక్షణ సమితి స్థాపించే అవకాశం లేకపోలేదు, మరి!

పంతులుగారు పరతత్త్వ చింతన కలవాడని చెప్పలేనుకాని, పరమ లౌకికుడు మాత్రం కాదు. విరాగి అనలేనుగాని, సంసారం అంటే అంత ప్రేమ ఉన్నట్లు కనపడేవాడు కాదు. ఆయన ముఖంలో నవ్వు చాలా అసాధారణంగా కనపడేది. అలా కనపడి నప్పుడు ఆయన సంతోషంగా ఉన్నా డని కాని, లేక నవ్వవలసిన అంశం తన ప్రసంగంలోనైనా, ఇతరుల సంభాషణలోనైనా ఉన్నదనికాని ఆయనతో బాగా పరిచయం కలవారే చెప్పగలరు.

ఏమైనా పంతులుగారు పడి పోయారు. స్పృహ లేకుండా దారిలో పడిపోయారు. తెలిసినవా రెవరో! అయినా ఆయన తెలియని వా రెవరుంటారు కనక! బండిలో వారింటికి చేర్చారు. బండివెంట వచ్చిన చిన్న పిల్లల గోల, ఆయన కుటుంబ సభ్యుల ఆందోళనలతో మధ్యాహ్నవేళ సుఖ నిద్రలో ఉన్న నేను ఉలికిపడి లేచాను. ఏమిటా కలకలం అని విచారిస్తే తెలిసిన విషయ్యం ఇది!

ఒక్కసారిగా నా మనస్సు జాలితో నిండిపోయింది. పంతులుగారిని చూసి నే నెప్పుడూ జాలిపడటం జరిగిన గుర్తు లేదు. కాని ఎక్కువ సార్లు ఆయనంటే కోపమే కలిగేది. కారణం?

పంతులుగారి వయస్సిప్పుడు అరవైఅట! నా కాయనతో కనీసం పదిహేను సంవత్సరాలనుంచీ పరిచయమున్నది. అంతకుముందుకూడా తెలుసు కానీ అప్పటి జ్ఞాపకా లేవీ లేవు. కాని ఆయన తోడేలు, కోడిపుంజు, నక్క, కాకి— ఇటువంటి కథలను అభినయ పూర్వకంగావినువుకలిగిన పాఠ్యాంసమయాల్లో పాఠశాలా విద్యార్థుల నందరిని సమావేశపరిచి చెప్పేటప్పుడు కలుగుతూ ఉండే ఆనంద వినోదాల స్మృతులు నన్నింకా వీడలేదు. పంతులుగారికి ప్రత్యక్ష విద్యార్థిగా ఉండే అవకాశం నాకు కలగలేదు. కారణం నేను అక్షరాలు, బాలశిక్ష ఇత్యాదులు దాదాపుగా మా తల్లిగారి వద్దనే నేర్చుకొనటంతో పాటు, ప్రాథమిక పాఠశాలలో సరాసరి మూడవ తరగతిలోనే ప్రవేశించటం! మూడవ తరగతిలో ఉన్నప్పటికీ, పంతులుగారు బోధించే ఒకటవ తరగతి తాలూకు దృశ్యం చాలా చక్కగా కనపడుతూ ఉండేది. చిన్నపిల్లలకు ఆయనంటే విచిత్రమైన ఆకర్షణ. ఎందుకంటే, క్రమం తప్పకుండా అను దినం ఆయన వారికి అందించే వినోదం సామాన్యం కాదు! కాని ఈ విషయం పంతులుగారికి తెలిసేదే కాదు.

ఏ రోజూ ఇంటర్వల్‌లో ఏర్పడిన గందరగోళంలో స్థిరంగా కునుక గలిగింది ఆయనొక్కడే! లోపలి గంట కొట్టిన రెండు మూడు నిమిషాలకు సంగీతం టీచరు వచ్చి ఈయన క్లాసులో దూకుళ్లఆట ఆడుకొనే పిల్లలకు రెండు తగిలించి ఆ బెత్తంతోనే పంతులుగారు కూర్చున్న మూడు కాళ్ల కుర్చీముందు కుడికాలుమీద టకటకా శబ్దం చేయగానే ఆయన అలారం మోతలోలాగా అదిరిపడి లేచి కూర్చొనబోతుంటే కుర్చీ పాటు తప్పి ముందుకు పడేది. సంతులుగా రొక ఎమర్జెన్సీ జంప్ చేసి కుర్చీ సరిచేసుకొంటుంటే ఆయన తత్తరపాటుకు పిల్లలంతా పగలబడి నవ్వేవారు. వెంటనే ఆయన సైలెన్స్ హుకుం జారీచేసి కుర్చీమీదకు మళ్లీ లంఘించి, "ఇంక నీవు వెళ్లవచ్చు, సంగీతరావ్!" అనగానే ఆయన నవ్వుకుంటూ వెళ్లిపోయేవారు. కొంచెం సేపట్లో ఆ సంగీతరావ్ తాలూకు "కోలాటంబులు ఆడుదమా. . ." పాటకు ప్రతిక్రియగా ఈయన "కాకి ఒకటి నీళ్లకూ. . ." అందుకొనేవాడు. పిల్లలంతా తమ ప్రియతమ అధ్యాపకునికి ఆధిక్యం కలిగించే దృష్టితో గొంతులు చించుకొని అరిచేవాళ్లు. దానితో అయిదో తరగతిలో ఆ టెండెన్సుతీసుకొనే "ఎడ్డమాస్టారు" గారు (పిల్లల పిలుపు) "ఏం గురూత్తమా?" అని ఒక సాలికేక పెట్టేవారు. పంతులుగారు తల గోక్కుని "ఉరేయ్! ఇహనందరూఒకట్లు వేయండిరా!" అని జోగుతూ ఇంటి బెల్లుకు ఎదురుచూస్తూ పైకప్పు వాసాలు లెక్కపెడుతూ ఉండేవారు. ఇంట్లో ఆయన ప్రవర్తన ఎలా ఉండేదో తెలుసుకొనవలసిన అవసరం గానీ, గ్రహించగలిగిన వయస్సుగానీ నా కప్పటికి లేవు. కాని ఏదైనా పనిమీద ఆయన ఉన్న ఇంటి బజారు గుండా వెడితే మధ్యాహ్నం మండు టెండలో అరుగుమీద కూర్చుని ఉండటం ఆయనకు ఏమి సరదాయో అప్పట్లో నాకు అంతు పట్టేది కాదు. అది భార్యామణి విధించిన శిక్షకు విధేయత అని తరవాత తెలిసిందనుకోండి!

మధ్యాహ్నం పాఠశాలలో జరిగే రోజువారీ కార్యక్రమాలలో పాడుం

డబ్బీ పర్వము, ఉత్తరీయాపహరణ ఘట్టము మరవరానివి. వీనిలో రెండవది జరగటం పంతులుగారి ఇష్టానిష్టాలపై ఆధారపడి ఉండేది. ఆయన ఉత్తరీయం వేసుకొని రాని రోజు పిల్లలకు ఎంతో దిగులుగా ఉండేది! పంతులుగారు ఒక చిటికె పొడుం పట్టించి మళ్లీ మధ్యాహ్నం నిద్ర కుపక్రమించేవారు. కాని పొడుండబ్బీ పొరపాటున పై జేబులో వేసుకొనేవారు. అంతకు ముందు దానిని బొడ్డులో పదిలపరచు కొనేవారులెండి! అది గ్రహించిన నాలుగో తరగతి నాగభూషణంగారు శిష్య ప్రముఖుడు వెంకటేశాన్ని పంపించి దానిని జాగ్రత్తగా సంగ్రహింపజేసి ఎవరికీ తెలియకుండా మా పంతులమ్మ గారి డ్రాయరు సొరుగులోకి చేర్చే వారు. సంగీతరావుగారు వచ్చి పంతులు గారిని నిద్రలేపి సాభిప్రాయంగా "ఒక చిటికెడు" అనగానే ఆయన ఉలికిపడి లేచి డబ్బీ కనపడక బెదిరిన గొడ్డులాగా ప్రవర్తించేవారు. . . హనుమంతుడు సీతాదేవిని వెతకటానికి అనుచరుల్ని నలుదిశలకూ పంపించి స్వయంగా సముద్రాన్ని అవలీలగా లంఘించినట్లు, పిల్లలను అటూ ఇటూ పంపి తను సరాసరి నాలుగో తరగతి నాగభూషణంమీది కురికేవారు. హనుమంతుని కయితే లంకలో సీతాదేవి దర్శనమిచ్చింది కాని దురదృష్ట వంతుడు మన పంతులుగారికి మాత్రం నాగభూషణం దగ్గిర డబ్బీ దర్శనమయ్యేది కాదు. నాగభూషణం ఎంతో అమాయికంగా "నీ జేబులోనే ఉందేమో చూడవయ్యా!" అంటే, 'ఛీ ఛీ! ఒక్క నా జేబేమిటి, అవసర మైతే పాతాళాన్నైనా ప్రవేశిస్తాను' అన్నట్లు పొడుండబ్బీని ధ్యానించు కుంటూ గంభీరంగా తన జేబులోనికి చెయ్యి పోనిచ్చేవారు. వలుగు ఇంగువని తగిలినప్పుడు లంకెల బిందెల కోసం ఆశించే వ్యక్తి ముఖంలో ఫ్లాష్‌బల్బు కాంతి కనిపించినట్లు పంతులుగారి ముఖం ఒక్కసారిగా వెలిగిపోయేది!! అంతే! దివ్యరూపంతో డబ్బీ బయటకు సాక్షాత్కరించేది! క్లాసంతా గొల్లుమనేది! పంతులుగారు ఇంత 'అమాయకుడూ, మతిమరుపు మనిషీ ఏమిటి?' అనుకొనేవారం. నేను నాలుగో తరగతిలో పడ్డాక అసలు రహస్యం, సంఘటనల క్రమం బోధపడ్డాయి. మూడో తరగతి మరియమ్మగారు ఈ నాటకంలో చాలా సమర్థవంతమైన పాత్ర నిర్వహించేది. పొడుండబ్బీ పంతులు గారి జేబులో ఆయనకు తెలియకుండా—ఆయనకేమిటి, చాలామంది పిల్లలకు కూడా— చేర్పించుటలో ఆమె సిద్ధ హస్తురాలు! ఈ సంగతులేవీ ఈ నాటికీ పంతులుగారికి తెలియవని నాకు తెలుసు.

కోపం రాకుండా ఎట్లా ఉంటుంది? జాలి పెరిగితే కోపం కూడా మారు తుంది! పంతులుగారి అసమర్థత, విధి నిర్వహణలో లోపాలను గురించి నాకు అంతులేని జాలి ఉన్నది. కారణం ఎవరైనా చెప్పినా గ్రహింపలేని ఆయన స్థిరచిత్తం, మార్పులేని వ్యక్తిత్వం!

* * *

సంగీతరావుగారి నవ్వడితో నా ఆలోచనకు అంతరాయం కలిగింది. బండివాడు తన 'బరువు వదిలింది' అన్నట్లు సంగీతరావుగారి సాయంతో పంతులుగారిని ఇంటిలోనికి చేర్చి బలంగా ఎడ్ల నదిలించుకు పోయాడు. ఇష్టం లేకున్నప్పటికీ, మానవత ఇంకా పూర్తిగా ఇగిరిపోనందువల్ల నేను వారింట్లోకి ప్రవేశించాను. ఆయన స్థితి చాలా దయనీయంగా ఉన్నది. అయిదున్నర అడుగుల విగ్రహమైనా అందుకు తగిన పుష్టి లేక కళ్ళు, ముక్కు ముందుకు వచ్చిన ముఖం వికృతంగా కనిపించింది. శరీరంమీద వివిధ పరిమాణాలలో విస్తృతంగా వ్యాపించి ఉన్న చర్మవ్యాధి చిహ్నాలు ఆయన దగ్గిరికి వెళ్ళటానికి భయం కలిగించాయి. నోటిలోనుండి వెలువడే దుర్గంధపూరితమైన ద్రవం అసహ్యాన్ని కలిగిస్తూంది. అన్నీ భరిస్తూ వైద్యుడు వచ్చేవరకూ ఉండి, అవసర మైన మందులను వాడమని పది రూపాయల నోటు పంతులుగారి భార్య చేతిలో ఉంచి వెనక్కి మరలాను.

* * *

సాయంకాల మయ్యేసరికి ఇంటిలో కూర్చోవటం చిరాకనిపించి చొక్కా తొడుగుకొని బయలుదేరాను. కొంచెం దూరం వెళ్ళేసరికి మా సూర్య నారాయణ ఎదురుపడ్డాడు. "ఏమోయ్, సూర్యం! మన జంతువుకు ఏమి జరిగినదో విన్నావా?" అన్నాను. మా సంభాషణలలో "జంతువు"అంటే "పంతులుగారు"అని అర్థం. ఆయనను జంతువని వ్యవహరించటంవల్ల తమ జాతికే తరతరాలకు తీరని అవమానం జరిగిందని మనలాగే నోరుంటే జంతువులన్నీ కలిసి ఒక 'జంతు గౌరవ రక్షణా సమితి' ఏర్పాటుచుకొని విపరీత మైన ఆందోళన ప్రారంభించేవికాని, వాటికి నోరు లేనంతవరకూ మా లాటి వారికి ప్రమాదం లేదు.

"ఇప్పుడైనా పరలోకగతుడైతే అదృష్టవంతుడే!" అన్నాడు. ఇంతలో పంతులుగారి పారమార్థిక చింతనకు ప్రయోగశాలవంటి శంకరా రైస్ మిల్లును సమీపించాము. బయటనే నిలబడి ఉన్న మా తోగారావు "రండోయ్!" అంటూ ఆహ్వానించాడు. లోపలినుంచి కుర్చీలు తెప్పించుకొని బయటనే వేసుకొని కూర్చున్నాము. కాఫీల కోసం హోటలుకు పంపిస్తే పనివాడు ఎంకడు వాటితోపాటు శశిరేఖమ్మ పంతులుగారి ఇంటికెళ్ళి వెడుతూందని కబురు తీసుకురావటంతో ముగ్గురం నివ్వెరపడ్డాము. ఏమి జరుగు తూందోనని చాలా ఆదుర్దా పడ్డాము. కారణమేమిటంటే ఇందాకే చెప్పాను పంతులుగారు పారలౌకికచింతన కొంచెం ఎక్కువగా కలవారని! అందుకోసం ఆయన ఇతరుల చేత బలవంతంగా పుణ్యం చేయించే వారు. విసుగు లేకుండా మిల్లుకు వడ్లు వేసుకువచ్చిన ప్రతివారి దగ్గిరా ఆయన ఉత్తరీయం జాపేవారు. ప్రతిఫలంగా ఆయనేమో బియ్యమూ, వారేమో పుణ్యమూ ఒకేసారి మూట కట్టుకొనేవారు. పంతులుగారి పరోప కార బుద్ధి ఆయనను అంతటితో ఆగనిచ్చేది కాదు. ఇహలోకంలోకూడా సాధ్యమైనంత ఎక్కువమందికి సహాయపడే ఉద్దేశ్యంతో బీదవారికి, అంటే బటానీలు, రేగిపండ్లూ, తాటి ముంజెలూ అమ్మేవారికి వారివద్ద తాము కొనుక్కున్న వాటికంటే ఎక్కువ విలువగల బియ్యం ఉదారంగా ఇస్తూ ఉండేవారు. ఈ సంగతి సిగరెట్ల సోమయ్యకు చాలా అసూయ కలిగిం చేది. "పొగ తాగనివాడు దున్నపోతై పుట్టున్" అని వాడు పంతులుగారిని ఎన్నిసార్లు రెచ్చగొట్టినా ఎందుకనో ఆయన ధూమపానాసక్తి ప్రదర్శించే వారు కాదు. ఈ సొదరు అంతకూ పోను మిగిలిన బియ్యం చిల్లరకొట్టు సీతయ్యవద్దకు, అందువల్ల వచ్చిన డబ్బు శశిరేఖమ్మవద్దకు చేరుతూ ఉండేవి. ఈ పనులన్నీ ఆయన పార్ట్ టైమ్ జాబ్ చేస్తున్నంత గర్వంతో చేసేవారు.

అయితే ఈ విషయాలన్నీ అందరకూ తెలియవు! తెలియజేస్తే ఎట్లా ఉంటుందా అని ఆలోచించినా, అందువలన ఆయన పడవలసివచ్చే అవస్థ ఊహించి ఆ ప్రయత్నం విరమించేవాణ్ణి.

శశిరేఖమ్మకు, పంతులుగారికి గల సంబంధం, అసంబంధంగాని ఎవరికీ తెలియవు. అయితే పంతులుగారి భార్య కామేశ్వరి తనకు సవతిగా శశిరేఖమ్మను నిందిస్తూ ప్రచారం చేస్తుంటే చాలా ఆశ్చర్యపడేవాణ్ణి. పంతులుగారికి అంత సామర్థ్యం కలదా అని! పంతులుగారుకూడా 'అదే నిజమయితే ఎంత బాగుండును' అని తీరిక దొరికినప్పుడల్లా మధ్యాహ్నం పూట పలవరిస్తూ ఉండేవారట నా చిన్నతనంలో! కాని అది అసాధ్యమని గ్రహించాక బుద్ధిగా ఆమెను కేవలం ఆప్తురాలిగానే భావించి ఆమె వలన తన భార్య కలిగించిన బాధలకు ఓదార్పు పొందుతూ ఉండేవారు. ఆమె ఈయన గారి విచిత్ర వ్యక్తిత్వానికి జాలిపడి అప్పుడప్పుడు చేతనైన సహాయం కూడా చేస్తూ ఉండేది. ఈ సంగతి కామేశ్వరమ్మగారి ఆగ్రహాన్ని, విష ప్రచారాన్ని ఉద్ధృతం చేసేది. ఆ ప్రచారం నమ్మేవారూ, నమ్మనివారూ కూడా ఉన్నారు. పంతులుగారి మనస్తత్వం, ఇతరులతో సంబంధ బాంధవ్యాలు, ప్రవర్తన ప్రత్యేక శ్రద్ధతో పరిశీలిస్తున్న నేను మాత్రం

---

## తప్పులు

ఎటువంటి వ్యక్తి అయినా ఒక తప్పు చెయ్యటం సంభవమే కాని, మూర్ఖుడు మాత్రమే తప్పులు చేస్తూంటాడు.

—సిసిరో

## ఆగ్రహం

ఆగ్రహోద్రేకాలు అగ్నివంటివి. ఎన్నో వేల రీతుల్లో ఉపయోగకరమైనవి; మోతాదు మించితే ఉపద్రవ కరమైనవి.

—బాపి

ఆ ప్రచారం కేవలం అబద్ధమని గ్రహించాము.

ఏమైనా ఇప్పుడు శశిరేఖమ్మ పంతులుగారింటికి వెళ్లింది. ఏం జరగవలసి ఉన్నదో! కామేశ్వరి స్వభావం తెలిసిన నేను చాలా గాభరా పడ్డాను. సహజంగా ఆమె సాత్త్వికురాలేగాని పంతులుగారు ఆమె సబలగా మారవలసిన పరిస్థితులుకల్పించారు. తొమ్మండుగురు సంతానాన్ని ప్రసాదించి కుటుంబాన్నే వృద్ధిచేశారుగాని, ఆర్జన ఏమాత్రం పెంచలేదు. పిల్లలు, సంసారంలో కష్టాలు, ఆమె అసహనము సమాన స్థాయిలో పెరిగినా, ఆయనలో ఏమీ మార్పు రాకపోగా చాలా బాధ్యతారహితంగా ప్రవర్తించటం ప్రారంభించాడు. పరిస్థితులు చూడగా తన పార్ట్ టైమ్ ఉద్యోగాన్నే పిల్లలకు జీవన వృత్తిగా ఏర్పరిచే ప్రమాద సూచనలు కనపడగానే మేల్కొనిన కామేశ్వరి విజృంభించి తననోటిబలంతో ఆయనను పూర్తిగా వశపరుచుకొన్నది. ప్రస్తుతం ఆయనకు, సంసారానికి గల సంబంధం ధనసంబంధమే! వెంజీతం తీసుకొని వచ్చి భార్యకిచ్చి, ఆమె తగలేసే భోజనంతోపాటు చీవాట్లను, చిరు దెబ్బలనుకూడా జీర్ణించుకొనటం పంతులుగారికి బాగా అలవాటయి పోయింది. లేమిని వ్యక్తపరుస్తూ ఇతరులవద్ద దీనంగా, హీనంగా ప్రవర్తించే భర్తవల్ల తన మనస్సుకు తగిలిన గాయాలను తేలికగానే మాన్పించుకోవటం కామేశ్వరికీ అలవాటయింది! ఈ స్థితిలో ఆయన నీచ ప్రవర్తనవల్ల ఆమె కఠినంగా మారిందో, లేక ఆమె తనపట్ల ప్రదర్శించే విరాదరణ, కాఠిన్యాల వల్ల మనశ్శాంతి లేక ఆయన ఇతరుల వద్ద దీనంగా ప్రవర్తించే మానసిక బలహీనతకు లోనయ్యాడో ఎవ్వరూ చెప్పలేరు.

"మునసబుగారూ! మునసబు గారూ!" అంటూ ఎవరో పరిగెత్తుకు వచ్చి సూర్యాన్ని పిలవటంతో మా మౌనానికి భంగం కలిగింది.

"ఏమైందిరా?" అంటూ సూర్యం లేచాడు.

"పల్లపువీథిలో పంతులు గారి కాళికమ్మ పెంకుటింటి శశిరేఖమ్మ గారిని ఇంట్లోంచి బయటకు తోసి తలుపేసిందండి. ఆమె మెట్లమీద నుంచి పడిపోయిందండి. ముక్కులో నుంచి నెత్తురు కారుతూంది."

'అరెరే! అనుకున్నంతా అయిందే' అనుకొంటూ నేనుకూడా తొందరగా సూర్యాన్ని అనుసరించాను.

మేము వెళ్లేసరికి పంతులుగారి గుమ్మం ముందు జనం పోగుబడి ఉన్నారు. దూరంగా డాక్టర్ రామారావు పాలిపోయిన ముఖంతో నిలబడి ఉన్నాడు. శశిరేఖమ్మ శవంమీద పడి కామేశ్వరి, పిల్లలు ఏడుస్తున్నారు. పంతులుగారు స్పృహలోనే నిస్సత్తువతో మంచానికి జారగిలబడి ఉన్నారు.

"మంచికి రోజులు కావు!"

"నిండుప్రాణంనిలువునా తీసేసిందే!"

"పరాయిళ్లలో జోక్యానికి పోరాదమ్మా!"

జనం రకరకాలుగా అనుకొంటున్నారు. సూర్యం కేసు నమోదు చేశాడు.

* * *

కాళికమ్మగా పేరు తెచ్చుకొన్న కామేశ్వరి అంత దారుణానికి ఏ పరిస్థితులలో, ఎందుకు పాల్పడినది, ఆమెకు ఏ శిక్ష విధించారు అనేవి ప్రస్తుతం అనవసరమైన విషయాలు. ఎదట లేకున్నా సంసారభారాన్నంతా అనుభవశూన్యుడైన ఆయనమీద వదేసి కామేశ్వరి భర్తను అనుక్షణం బాధిస్తూనే ఉన్నది. పిల్లలు ఆయన మాట ప్రకారం ప్రవర్తించటం, వాళ్లను సరియైన పద్ధతిలో ఇక ముందు ఆయన పెంచగలగటం అసాధ్యమైన విషయాలే! పంతులుగారిప్పుడు నిజంగా ఒంటరివాడయ్యాడు. ఊరట కలిగించేందుకు శశిరేఖమ్మకూడా ఈ ప్రపంచంలో లేదు. కాని ఆయన ప్రవర్తనలో చాలా మార్పు వచ్చింది. ఆయన సర్వీసులో అప్పటికి మిగిలి ఉన్న పన్నెండు రోజుల్లోనూ స్కూల్లో నిద్ర పోలేదట! నాగభూషణం ఆయన పాడుండబ్బీకేసి చూడటానికి కూడా సాహసించి ఉండడు. ఉపాధ్యాయుడుగా ఆయన విధినిర్వహణ సరిగా చేసినది ఆ పన్నెండు రోజులలో మాత్రమేనని అందరు అనుకొన్నారు. పదవీ విరమణ వల్ల అవకాశం ఎక్కువైనా, పరోకారార్థం ఆయన మిల్లులో కనిపించినట్లు జోగారావు నాతో ఎప్పుడూ చెప్పలేదు. బీదవాళ్లు ఆయనతో మాట్లాడటానికి చాలా భయపడటం ప్రారంభించారు.

ఆ మధ్య ఒక రోజు సంజెచీకటిలో ఇంటికి వస్తున్నాను. శశిరేఖమ్మగారి వీథి అరుగుమీద వారి ఉన్న ఆకారం "సంసారజాల పతితస్య జగన్నివాస" అని లక్ష్మీనృసింహస్తోత్రం వల్లిస్తూంటే పరకాయించి చూచి ఆశ్చర్యపోయాను. సంతోషంకూడా కలిగింది.

కొంచెం ఆలస్యంగానైనా పంతులుగారి జీవచ్ఛవంలోనుంచి వ్యక్తి లేచాడు! ★



రాచఠీవి
చిత్రం—కె. సరోజిని (బర్ద్వాన్)